# హృదయశల్యము

(గతసంచిక తరువాయి)

శ్రీ ఆర్. రంగనాథశాస్త్రి

కొంచెము కల్పిత ధిక్కారము, కల్పితకోపము, పైకి చూపు. తప్పులేదు. ధర్మహానికలుగదు.

విద్యా- అట్లయిన నిదివరకెప్పుడో, ఆయనను బెదరించి యుందును. ఎవరియెడలను, అట్లు ప్రవర్తించుట న్యాయముకాదు, భర్తకదనా!

సుంద- చెల్లీ తప్పులేదు. నామాటవిశ్వసించు. భర్తను వశపరచుకొనుటకిది సహజోపాయము. ఇందు నిజమునకు ధిక్కారములేదు. కల్పితధిక్కారము - కాదంటావా! అమ్మనానల చూచివస్తానను. వద్దంటే మానుకో!

విద్య- సరే, వద్దంటె బయలుదేరనుసుమా !

సుం- సంతోషము.

సుందరరావు స్నానముచేసి వెంకటరావు వచ్చువరకుండి ఇర్వురును భుజించి తోటలోనికి బోయిరి....

ఆదినము మధ్యాహ్నము వెంకట్రావు శయనించి యుండెను. కాని నిదురనెరుంగదు. మనోబాధతోడ మలమలమాడుచుండెను. సర్వలక్షణ సంపన్నయగు భార్యనువీడి తప్పుద్రోవల చరింపుచుండుటకు సిగ్గుపడజొచ్చెను. సుందరరావు వచ్చినప్పటినుండి యాతని హృదయవేదన మిక్కుటమాయెను. అనుమాన పిశాచమునకాతడు బలియగుచుండెను. కాని యణుమాత్రమైనను పైకి వెలువరింపకుండెను.

ఆతని యనుమానమునకంతకు కారకుడు సుందరరావు. అందువలన సుందరరావును త్వరితముగ సాగనంపుటకు పన్నాగములు పన్నుచుండెను. చదువుకు డబ్బిచ్చెదననెను. కాని ఎప్పటికప్పుడు సుందరరావు ప్రయాణమునకు, వాయిదాలు వేయసాగెను.

వెంకట్రావు హృదయాగ్నిని చల్లార్చుకొనుటకొక భ్రష్ట స్త్రీసాంగత్యము చేయజొచ్చెను. కాని యందువలన నాయగ్ని వృద్ధికాసాగెను. అనుమానగ్రస్థుడు, కుటిలుడగు, వాడు వివేకమును గోల్పోవుటయం దాశ్చర్యమేమున్నది!

సుంద- ఒరే. తెల్లవారుజామున నాప్రయాణం. జట్కాబండివచ్చును. సుందరి నాతో బయల్దేరును. మామయ్య యుత్తరము వ్రాసినాడు.

కాని యీమాటలకు వెంకట్రావు ప్రత్యుత్తరమీయకుండెను. తిరిగి చేజిక్కిన రత్నము జారిపోవుచున్నదేయను భయమంకురించెను. కర్తవ్యమేమి? తల్లడిల్లజొచ్చెను.

వెంకట్రావు సాయంతనము నాలుగుగంటలవేళ స్వగృహమునకరగెను. విద్యాసుందరి గదియందుండెను. ఇటునటుతిరిగెను. తల్లియిచ్చిన మజ్జిగనుద్రావెను. గదితలుపు తాకెను. లోపల గడియవేయుచున్నటుల గ్రహించెను. తలుపు తెరువుమని నుడువుటకు నోరాడదాయె. తిరిగి ప్రాంగణములోనికివచ్చెను. సుందరావు విద్యాసుందరిని దీసికొనిపోవునను విషయము తలమీద పిడుగుపడినటులుండెను. తిరిగి గృహములోని కరగెను. ఇటునటు దిరిగెను. భార్యను పలుకరింపదలచెను. కాని పలుకరింపజాలకుండెను. తన ప్రవర్తనకు తాను లజ్జింపుచు, గబగబతోటలోనికేగెను.

వెంకటరావు మానసికబాధను, సుందరరావు సంపూ

ర్ణముగ గ్రహించెను. కాని తెలియనటుల నటింపుచుండెను.

వీరిర్వురు సాయంతన భోజనమునకు గృహమున కరుగునప్పటికి జట్కాబండివచ్చెను. భోజనసమయమున సుందరరావు పెదతల్లి యిట్లనియె. 'అంగట్లో అన్నియున్నవి. అల్లునినోట్లో శని' అన్నట్లున్నదిరా. నాయనా మాకొంప. ఏకపుత్రవిషయం. ఒకరినొకరు చూచుకోరు. ఎడమొఖం - పెడమొఖం- కాటికి కాళ్లుచాచుకున్నదానను. ఏంచేసేదిరానుందూ! ఆ యెముడు ముండాకొడుక్కుకూడ నామీద దయరాలేదు...(అనుచు యేడ్చును.)

ప్రతిదినము వెంకట్రావు భోజనానంతరము గదిలోని కరిగి చిలకకొయ్యలకు తగిలించిన చొక్కాను దొడుక్కొని తోటబంగాళాకుబోవుట మామూలు. అటులనే గదిలోనికిబోయెను. నిలుచుండిన విద్యాసుందరిని గాంచెను. బీరువాతలుపులు తెరచియుండెను. చేతనొక నలుచదరపు జపానుపెట్టెను బట్టుకొని విద్యాసుందరి భర్తనుద్దేశించి యిట్లనియె. 'మీరిచ్చినబట్టలు నగలు ఆపెట్టెయందు, బీరువాయందున్నవి. అవిగో తాళముచేతులు' ఈపెట్టెలోనివి, నాగ్రంథములు, మానాన్న నాకిచ్చిన బట్టలు. అమ్మనానలను చూడవలెననుకున్నాను. తెల్లవారుజామున ప్రయాణం. మీరుకూడావచ్చిన పరమసంతోషం. కాని రమ్మనిపిలుచుహక్కు నాకు రెండువత్సరములక్రిందటనే గతించినది. తప్పులు క్షమించండి.' అనుచుండ వెంకట్రావు ఆమెకేసి యెగాదిగాచూచి తలవంచుకొని - తత్తరబిత్తరలాడుచు బీరువాయందలి వస్త్రములు మొదలగువానిని పరిశీలింపజొచ్చెను. పెట్టెయందలి నగలు మొదలగువానిని చూచెను. కొన్నిబట్టలను క్రిందవైచెను. నగలను గోడమూలకు విసరెను. కాని యీతనికా యాతురయేమి! వస్తువులు వస్త్రములు మొదలగువానిని లెక్కింపుచున్నదా! కాదు. అయిననేమి, ఎందుకు - ఆతొందర!

విద్యాసుందరి భర్తవర్తననుగాంచి యాశ్చర్యపడజొచ్చెను. భయపడుచు 'విన్నారండీ! నేను గుంటూరు వెళ్ళుతాను.'

ఆమాట యాతనిచెవి దూరదాయెను. వెదకుచుండెను. వస్తువులను చిందరవందర చేయజొచ్చెను. బిత్తరిమోమున చూచుచు తత్తరపడజొచ్చెను. చేజిక్కిన రత్నము చేజారుచున్నదనియా, లేక, హృదయశల్యమై తమ్మిర్వుర విడదీసినవస్తువేదయిన గలదనియా! నిర్ణయించుటెట్లు! అయితే, యీవికారచేష్టలకు కారణమేమి?

పది పదునేడు నిముసములు గడచినపిమ్మట సుందరి చేతియందలి జపానుపెట్టెకేసి వెర్రిచూపుల నిగుడింపజొచ్చెను. కాని యావిషయమును విద్యాసుందరి గ్రహింపలేదు. వెంకట్రావు శరీరమునుండి చెమటకారుచుండెను. తలముడి వీడిపోయెను. నేల చతికిలబడి జపానుపెట్టెవేసి చూచుచున్నచూపును మరలించుకొనలేకుండెను. విద్యాసుందరి- 'వస్తువులన్నియు సరిగనున్నవిగదా శెలవు.'

వెంకటరావు... ... ... ...

విద్యాసుందరి- సరేయనిన సంతసించెదను. ఆమాటకు కూడ నేను నోచుకొనలేదా! ఇంతకు, ఎవరిననిన నేమి· లాభము? అనుభవింపకతీరదు.

అనుచు, ట్రంకును సావడిలోనికి తీసికొనిబోవుటకు యత్నించెను. చేతనున్న జపానుపెట్టెను క్రిందబెట్టుటకు ఇష్టములేదు. ఇక చేయునదేమి? 'సుందరరావన్నా! ఇంట్లోకిరా! పెట్టెసావిట్లోకి తేలేకున్నాను. బరువుగానున్నది. అని బిగ్గరగ బిలిచెను. వెంకటరావు గోడకు జారగిలబడి కూర్చుండి విద్యాసుందరి చేతియందలి పెట్టెకేసి దృష్టినిగిడ్చి యుండెను.

వెంకటరావు గదితలుపుకు లోపలగడియ వేసెను. కాని యాసంగతి విద్యాసుందరికి తెలియదు. సుందరరావు తలుపునెట్టెను. కాని యది యెటులవచ్చును? విద్యాసుందరి తలుపుకడకుబోవుచుండ అత్యంత దీనవదనమున వెంకట్రావు ఇట్లనియె. 'ఎందుకింతతొందర'

విద్యా- ఇందు తొందరేమున్నది! ఆలస్యమేమున్నది! మీరు సౌఖ్యముగ నుండుటయే, నాకుకావలసినది. నన్ను మరచిపొండి. (కన్నీరుకార్చును.)

వెంకట్రావు- బోధకాకున్నవి నీమాటలు.

విద్యా- 'బోధపడకపోయేదేమున్నదండీ నేను పుట్టిం

టికిబోతున్నాను. (యేడ్చుచు) మీరు ఆనందముగ నుండుటయే నేనుకోరునది. నాపాపఫలమును నేననుభవించెదను. మీదోషమిది. నాదోషనాదిరైయింది. మనయిద్దరి మార్గ మొక్కటికాలేదు. ఇక చేయునదియేమి? నేను మీమార్గమునకు ముండ్లకంచెను. నేను తొలంగిన మీరు హాయిగా నుండవచ్చు. వెళ్లు'అనిన సంతసించెదను' అని యనుచుండ యామెకాలియందలి జపానుపెట్టె క్రింగ బడెను. చివ్వున లేచి వెంకటరావు ఆపెట్టెను చేతబట్టుకొనెను. విద్యాసుందరి నేల చతికిలబడెను. వెంకట్రావు దానిని తెరచి చూడబోవ విద్యాసుందరి యిట్లనియె: 'మీకెందుకది. దానిని మీరువిప్పవద్దు. అందు నాప్రాణాధికపదార్థమున్నది. నాహృదయరహస్యము బైటపడును. వద్దు. నాపెట్టెనాకివ్వండి. దానివదలి నేనొక్కనిముసమైనను బ్రతుకలేను (యేడ్చును).

వెంక- (పెద్దగొంతుకతో) తే. తాళముచెవ్వితే—

విద్యా- అది నాకుసంబంధించినది. అందుండుదాన్ని నేనుతప్ప ఇతరులు చూడరాదు. మీరుకూడ చూడవద్దు. నాబొందిలో ప్రాణముండువరకు దాన్ని నాకడనుండ నీయండి. అంత ఆగ్రహమెందుకండి;

వెం- కాదు- ముందునన్నుచూడనీ నీదగ్గర నేయుంచుకోవచ్చు. ఇవ్వు- తాళముచెవ్వి- (అనుచు మైమరచుచుండెను).

విద్యాసుందరి యేడ్చుటయు, అత్యంతతడవు స్వరమున వెంకట్రావువేయు కేకలును, సుందరరావుచెవిని బడుచుండెను. కాని సంభాషణమాత్రము సరిగ బోధపడకుండెను. తత్తరంబొందుచు, అవసరమైనచో తలుపుపగులగొట్టి లోన బ్రవేశించుటకు గడ్డపలుగు చేతబుచ్చుకొని సంసిద్ధుడైయుండెను.

విద్యాసుందరి- నాపెట్టెనాకియ్యండి. దానితో మీకేమిపని? కావలసిన నాప్రాణములను సంతసముగ నిచ్చెదను తీసికొనుడు. అందు నా హృదయధనమున్నది. దానినెవ్వరికి చూపరాదు. మీరుకూడా-

వెంక- ఇంతనిర్భయమా? ప్రాణములే దీసికొంటా, జాగ్రత- సిద్ధముగానుండు. భగవంతునిదలచుకో- నా హృదయశల్యమిందే యున్నది.

సుందరరావు చెవులయందీమాటలు జారెను. ప్రాణాపాయమని గ్రహించెను. కేకలువేయజూచెను. కాని నేను సుందరిని రక్షింపజాలనాయని యనుకొనుచు గునుపమున తలుపు బగులగొట్టుచుండెను.

వెంకట్రావు కనులనుండి విస్ఫులింగములు చెల్లాచెదరగుచుండ, పండ్లు పటపటకొరుకుచు, సుందరి మొలనున్న తాళముచేతులను లాగుకొనెను. తలవీడెను. జంధ్యములు జారినేలబడెను. కాని యాక్రోధోన్మత్తుడా పెట్టెను తాళముచెవితోడ నెట్లు తీయగలడు? తీయుయత్నింప పెట్టె చేయిజారి క్రిందపడెను. తాళపుచేతులు విద్యాసుందరిమోమున విసరిగొట్టెను. కాని యవియామె కాళ్లకు తగిలి క్రిందబడెను. కాలునుండి నెత్తురు కారుచుండెను. కాని యావిషయమామెకు తెలియదు. భర్త భీభత్సరూపమునుగాంచి గజగజవణకుచు, ఏమీ? ఈ యాకస్మిక ప్రళయమని' నివ్వెరపడి చూడసాగెను.

వెంకట్రావు నేలనుండి యాపెట్టెనుగైకొని గోడకు గొట్టెను. పగులలేదు,

ఆలసించిన ప్రాణాపాయముగలుగునను భీతిచే సుందరరావు, తలుపును గునుపమున విడదీయుటకు సర్వశక్తులను వినియోగింపుచు కేకలువేయజొచ్చెను. జీతగాడు వచ్చెను. మరియొక పెద్దపలుగుదెచ్చెను. తలుపుచెక్కల యందు రెంటిని జొనిపి లాగుచుండ తలుపుచెక్కలు పెళపెళలాడుచు వీడిపోయెను.

వెంకట్రావు తిరిగి యాపెట్టెను దీసికొనెను. విద్యాసుందరి మోమునవిసరిగొట్టెను. గురితప్పెను. గోడకుతగిలి చెక్కలూడిపోయెను. అందు పసుపుకుంకుమ బొట్లుగల తెల్లగుడ్డతోచుట్టిన నలుచదరపు ఫ్రేముండెను. 'రాక్షసీ ఒక్కనిమేషమాగు సిద్ధముగనుండు.' అని కేకలువేయుచు, పదాఘాతముల భూమి కంపింపుచుండ ఆపొట్లమును చేతబట్టుకొనెను. దానిమీదిగుడ్డను దొలగించుటెట్లు? నిదానమేదీ, దానిని పండ్లతోచించివైచెను. లోపలదానికి చుట్టిన పసుపురంగుకాగితమును పీకివైచెను.

అదియొక వెండిఫ్రేమునందలి పొటగ్రాపు. దానిని త్రిప్పిత్రిప్పిచూచెను. క్రోధోన్మత్తు డాపొటగ్రాపు నెట్లు గుర్తింపగలడు? మోడగలడు చూడజొచ్చెను. 'ఇదియే

నాహృదయశల్యము' 'ఇదియే నాహృదయశల్యము' అని యనుచుండ 'అదియే నా హృదయధనము' అని చేతులు జోడించుకొని విద్యాసుందరి నుడువజొచ్చెను.

అప్పుడు సుందరరావు కంపితగాత్రమున లోన ప్రవేశించెను. వెంకటరావు అతనిచూచి పొటగ్రాపునుచూచి చూచి- చూచి నిలువున క్రింద బోర్లబడెను. సుందరరావు నివ్వెరపడి చూడజొచ్చెను. విద్యాసుందరి నిమీలితనేత్రయై ముకుళితహస్తముల భగవానుని ప్రార్థింపుచుండెను.

ఒకటిరెండు నిముసము లతిక్రమించెను. వెంకటరావు తెప్పరిల్లి లేచికూర్చుండి, విద్యాసుందరి పాదములమీద వ్రాల, ఆమె చివ్వునలేచి ప్రక్కకొదిగి నిలుచుండెను. అప్పుడు వెంకట్రావు ఇట్లనియె. 'సుందరీ! క్షమించు- ఈదుర్మార్గుని- క్రూరుని- మత్సరగ్రస్తుని క్షమించు. చిన్నప్పటినుండియు, నాకు సుందరునిమీద మత్సరము, అసూయ- అనుమానము- విద్వేషము- ఆపాపఫలమే నా వర్తనమును భ్రష్టమొనర్చినది. నిన్ననేకవిధముల బాధించితిని. ఎప్పటికప్పుడు నిన్నుచంపి నేను చావవలయునని ప్రయత్నింపుచుంటిని. కపటము నా వంటబుట్టినది. విషము దాచియుంచితిని. దానిని నీకిచ్చి నేను త్రాగవలయునని నీ సంగీతసాహిత్య రూపురేఖావిలాసముల కసవ్యాపడుచుంటిని. అందువలన నీవీణను పగులగొట్టితిని, ఇంటికివచ్చువారందరు నన్ను వంచించుటకేయని దలంపజొచ్చితిని. నిన్ను ప్రశంసించుటను వినజాలకుంటిని. తగుసంబంధముదొరకక నిన్ను నాకిచ్చి పెండ్లిచేసిరనియు నీవు బాల్యమునుండి సుందరరావును ప్రేమించి యాతనికొరకు-నిరంతర మెదురుచూచుచు అతని పొటగ్రాపును పూజింపుచున్నావని తలంచుచుంటిని (కన్నీరుగార్చుచు] కాని యీదుష్టబుద్ధి- పాపి- క్రూరుని పొటగ్రాపును పూజింపుచున్నావు. క్షమించు. నీవు సాధ్వివి. పురాణములయందు వర్ణింపబడిన మహాసాధ్వివి. నాకు సంపూర్ణముగ హృదయమర్పించితివని నేనెరుంగను. ఎరుంగగల వివేకము నాకులేదు...అనుచు నామెపాదములమీదబడబోవ విద్యాసుందరి దూరముగ జరిగి నిలుచుండెను. వెంకటరావు మూర్ఛిల్లెను.

రాత్రి మూడవయామ మతిక్రమింపుచుండ వెంకటరావునకు తెలివివచ్చి గూర్చుండెను. విద్యాసుందరి విసరుచుండెను. అప్పుడిర్వురను స్నానమాడిరి. పట్టువస్త్రములధరించి తులసిచెట్టుకడ కూర్చుండి 'చక్కని రాజమార్గములు- నీదు చరణములే- బ్రోవవమ్మా'- అనుకృతులను పరమానందముగ బాడజొచ్చిరి......తల్లిని సమీపించి వందనంబాచరించిరి. ఆమె ప్రేమాశ్రువులతో గూడిన యాశీర్వాదములను శిరమునధరించి సుందరరావు కాళ్లమీదబడబోవ అతడు తప్పించుకొని యిట్లనియె: 'అన్నా! నీవు నాకు సోదరుడవు, జ్యేష్ఠుడవనితలంచు. సుందరీ నీవు నాకు సోదరివి. ఏకోదరులమని భావింతు. సోదరభావమున మీరు నేను. ఆంధ్రావని ధన్యమగు గాత...

ఉదయమున నే ప్రయాణము. గుంటూరుకు. ఒక్క గడియప్రొద్దుకంటె యెక్కుడులేదు. నిముసములో సిద్ధముగా సుందరీ: నీమనోభీష్టానుసారము లక్ష్మిని వివాహమాడుదును.

అనుచుండ ఆమె పూర్ణచంద్రుని ధిక్కరించు ముఖమండలము దివ్యజ్యోతుల నీనజొచ్చెను. చిరునగవునకు పండువెన్నెలలు పరిభవింపబడి వెలవెలబోసాగెను.

REGD. TRADE MARK
MESSRS LAKSHMI & CO

దేశం
బాగుపడాలంటే
అందరు
ఏకముకావాలి!!

కోట్లకొలది ప్రజఘోరమరణాలపాలౌతూవుంది! అంటరానివారిని- దరిచేరుస్తున్నాం!—అంటరాని రోగులకు మనంచేస్తున్న ఉపకారాలేమిటి??

"లెప్పర్ క్యూర్" వేలకొలది, కుష్ఠు, బొల్లి, మేహరోగులకు పునర్జన్మ ప్రసాదించి!!

గ్యారంటిచికిత్స ఇస్తోంది!!

* నకలు మందులకు మోసపోక "లెప్పర్ క్యూర్" నే వాడండి:—

లక్ష్మీ అండు కో., (రిజిష్టర్డు)

H.O. వాల్టేరు ఆర్. యస్. పోస్టు.
బ్రాంచీలు:—144, బ్రాడ్వే or P. B. No. 137. మద్రాసు. గాంధీనగరం, బెజవాడ.